క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

కాటారం : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రేపు(శుక్ర వారం) చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ ఎడ్ల సతీశ్‌కుమార్ తెలిపారు. సంఘం ఆర్థిక లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరీ, అభివృద్ధి పనులు, తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు. సంఘం డైరెక్టర్లు, రైతులు, ఖాతాదారులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల ప్రతిభ

చిట్యాల : మండల కేంద్రంలోని సువిద్య డిగ్రీ కళాశాల విద్యార్థులు కాకతీయ యూనివర్సిటీ ప్రకటించిన ఒకటి, మూడు, ఐదు సెమిస్టర్ యూజీ ఫలితాల్లో జిల్లాలోనే మొదటిస్థానంలో నిలినట్లు కళాశాల కరస్పాండెంట్ కె.రాజు బుధవారం తెలిపారు. విద్యార్థులను అభినందించారు. నోముల వేణు, లోకేందర్ రెడ్డి, మమత, కుమార్, రజిత, ప్రశాంత్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం పేరుతో మోసం'



భూపాలపల్లి రూరల్ : రాజీవ్ యువ వికాసం పేరుతో నిరుద్యోగ యువకులను కాంగ్రెస్ మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. రేషన్‌కార్డులు లేకుండా దరఖాస్తు చేయడం ఎలా అని ప్రశ్నించారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో హరీష్, మంత్రి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

టేకుమట్ల : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై దాసరి సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల భవిష్యత్ నాశనం అవుతుందని, వాటి నివారణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తే 8712658111 నంబర్‌కు కాల్ చేసి, సమాచారం అందించాలని పేర్కొన్నారు.

కారు బోల్తా

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కుదురుపల్లి వద్ద బుధవారం కారు బోల్తాపడింది. కాళేశ్వరం నుంచి హనుమకొండకు వెళ్తున్న కారుకు బైక్ అడ్డు రావడంతో తప్పించబోయి బోల్తాపడింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

భూ సేకరణ సర్వే

కాటారం : చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా కాల్వల నిర్మాణానికి మండలంలోని మల్లారంలో బుధవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు భూ సేకరణ సర్వే నిర్వహించారు. భూ సేకరణకు సంబంధించిన నిర్వాసిత రైతులతో మాట్లాడారు. ఎంత మేర భూమి అవసరం అవుతుంది, కాల్వల నిర్మాణ ప్రతిపాదన రైతులకు వివరించారు. సర్వేకు రైతులు సహకరించాలని అధికారులు కోరారు. పలువురు రైతులు తమ అభ్యంతరాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ఈఈ ఉపేందర్, ఏఈ వెంకన్న, ఆర్‌ఐ వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



రేగొండ : మండలంలోని బాగిర్థిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అనిత మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, భాగ్యలక్ష్మి, కల్పన, ప్రతిభ భారతి, రమేష్, రఘు, సనత్ కుమార్, శివ కుమార్ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని పద్మావతి, అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ కవిత సమక్షంలో అర్చకులు, సిబ్బంది హుండీ లెక్కింపు నిర్వహించారు. రూ.1,29,438 ఆదాయం వచ్చిందన్నారు.

డబుల్ రోడ్డు నిర్మించండి



రాఘవరెడ్డిపేట-పర్లపల్లి ప్రధాన రహదారి



రాఘవరెడ్డిపేట-కుందనపల్లి ప్రధాన రోడ్డు

సింగిల్ రోడ్డు.. మలుపులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

టేకుమట్ల : రవాణా సౌకర్యం మెరుగ్గా ఉంటే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. వాహన రాకపోకలు కొనసాగే రోడ్డును విస్తరించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగానే ఉంటాయి. నియోజకవర్గంలో ఎక్కువగా గ్రామాలకు వెళ్లే మార్గాల్లో డబుల్ రోడ్లే ఉన్నాయి. కొన్ని చోట్ల సింగిల్ రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు ఎక్కువగా మూల మలుపులు ఉండడంతో ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. మండలంలోని రాఘవరెడ్డిపేట-పర్లపల్లి ప్రధాన రోడ్డు, రాఘవరెడ్డిపేట-కుందనపల్లి, దుబ్యాల, గుమ్మడవెల్లి ప్రధాన రోడ్లు దశాబ్దాలుగా సింగిల్ రోడ్డుపైనే రాకపోకలు కొనసాగుతున్నాయి. రోజు అనేక వాహనాలు రాకపోకలు సాగే రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా ప్రమాదాల్లో ఎంతో మంది వాహనదారులు మృత్యువాత పడ్డారు. రోడ్డులో ఎదురెదురుగా రెండు భారీ వాహనాలు ఎదురైతే ఆగాల్సిందే. అలాగే సింగిల్ రోడ్డు వెంట ఇరువైపులా చెట్లు, ముళ్లపొదలు ఉండడంతో మరింత ఇరుకుగా మారింది.

రోడ్డు పొడవునా మలుపులే..

సింగిల్ రోడ్డు ఉన్న రాఘవరెడ్డిపేట-పర్లపల్లి ప్రధాన రోడ్డు, రాఘవరెడ్డిపేట-వెల్లంపల్లి, కుందనపల్లి, గుమ్మడవెల్లి ప్రధాన రోడ్డులో ఎక్కువగా మూల మలుపులు ఉండడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇరుకు రోడ్లు, మూల మలుపులే ప్రమాదాలకు కారణమని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్ల వెంట ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

డబుల్ రోడ్డు కోసం ఎదురు చూపులు

నిత్యం జమ్మికుంట పట్టణానికి ఈ రోడ్డు వెంటే వాహనాలు ప్రయాణించాలి. రోడ్డును విస్తరించి డబుల్ రోడ్డు నిర్మిస్తే ప్రమాద రహిత రాకపోకలతో పాటు ప్రయాణ సౌకర్యం మెరుగు పడుతుందని మండలవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

రోడ్లను అభివృద్ధి చేయాలి



జమ్మికుంటకు వెళ్లే దారిలో రాఘవరెడ్డిపేట నుంచి భూపాలపల్లి నియోజకవర్గం చివరి గ్రామమైన పర్లపల్లి వరకు సింగిల్ రోడ్డు ఉంది. పర్లపల్లి దాటిన తర్వాత హుజూరాబాద్ నియోజకవర్గ ప్రారంభ గ్రామమైన బూజునూరు నుంచి డబుల్ రోడ్డే ఉంది. అధికారులు, పాలకులు నియోజక వర్గ రోడ్లను సైతం అభివృద్ధి చేయాలి. అందుకు డబుల్ రోడ్డు నిర్మించి రవాణా సౌకర్యాన్ని మెరుగు పర్చాలి.

- తుమ్మేటి సురేందర్‌రెడ్డి, రాఘవరెడ్డిపేట

వాహనం వస్తే ఆగాల్సిందే..



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి రోజు ఆటో నడుపుకుంటు జీవిస్తున్నాను. సింగిల్ రోడ్డు కారణంగా ఎదురుగా వాహనం వస్తే ఆటోను పక్కకు నిలుపుకునే పరిస్థితి ఉంది. సింగిల్ రోడ్డు వల్ల ఎన్నో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. డబుల్ రోడ్డు కోసం కొన్ని సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాం. డబుల్ రోడ్డు నిర్మించి రవాణా సౌకర్యాన్ని కల్పించాలి.

- పురుషోత్తం శంకర్, ఆటో డ్రైవర్ కుందనపల్లి

పేదల సంక్షేమానికి భారీ బడ్జెట్

మాజీ ఎంపీపీ సమ్మయ్య

కాటారం : పేదల సంక్షేమమే ధ్యేయంగా గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం భారీ బడ్జెట్ ప్రవేశపెట్టిందని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో బడుగు, బలహీన వర్గాలకు, పేదల సంక్షేమానికి అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేయడం జరిగిందని పేర్కొన్నారు. బడ్జెట్ రైతుల అభ్యున్నతి, మహిళల ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ బడ్జెట్‌తో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధితో ముందుకు దూసుకెళ్తుందని మాజీ ఎంపీపీ అన్నారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి అశోక్, భూపెల్లి రాజు, ఆత్మకూరి కుమార్ యాదవ్, గడ్డం కొంరయ్య, బీరెల్లి మహేశ్, మారుపాక రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమ్మయ్య

అసమర్థ పాలనకు నిదర్శనం బడ్జెట్

- భూపాలపల్లి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణిరాకేశ్



మాట్లాడుతున్న శ్రీహర్షిణిరాకేశ్

కాటారం : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ముఖ్యమంత్రి అసమర్థ పాలనకు నిదర్శనమని భూపాలపల్లి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్ విమర్శించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలను తుంగలో తొక్కి కాంగ్రెస్ కార్యకర్తల జేబులు నింపడానికి ప్రజాధనం దుర్వినియోగం చేసేలా బడ్జెట్ కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఐదు వందల రోజులు గడిచిన హామీలు అమలు చేయకపోవడం శోచనీయమని, ఆరు గ్యారంటీల్లో భాగంగా యువ వికాసం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.5లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ పథకాన్ని కాంగ్రెస్ జేబులు నింపే పథకంగా మార్చారని శ్రీహర్షిణి ఆరోపించారు. తెలంగాణలో మహిళలకు ప్రతి నెలా ఇస్తామన్న రూ.2,500కు బడ్జెట్‌లో కేటాయింపులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. పరిపాలన చేతకాక తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను జాతీయ స్థాయిలో దిగజార్చిన రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా అబద్ధాల పరిపాలనకు ముగింపు పలికి వాస్తవంలోకి రావాలని సూచించారు.

'మంద కృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ'



కాటారం: మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



టేకుమట్లలో..

కాటారం : మంద కృష్ణ మాదిగ 30ఏళ్ల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి మాదిగ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తూ తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాబోయే ఉద్యోగ నోటిఫికేషన్లలో వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు చంద్రగిరి అశోక్, మంతెన శ్రావణ్, శ్రీనివాస్, రాజు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

టేకుమట్ల : ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందగా బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, ఏవైఎస్ నాయకులు పాలాభిషేకం చేసి, సంబురాలు జరుపుకున్నారు. ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సంగిరవి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేనుకుంట్ల శంకర్, మారెపల్లి కొమురయ్య, కన్నూరి సారయ్య, రాం రాంచందర్, ఇల్లందుల శంకర్, శ్రీకాంత్, రాజయ్య, ప్రభాకర్, బోయిని మధు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాల పంపిణీపై హర్షం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఏపీఎం

మొగుళ్లపల్లి : మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం వెలుగు మండల సమాఖ్య మొగుళ్లపల్లి కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చిత్రపటాలకు మహిళలు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ రఫీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య ఏపీఎం రవి వర్మ మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలోని 657 సంఘాలకు రూ 1,06,97,294 రుణాలు రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమమలో సిబ్బంది బత్తిని శ్రీనివాస్, గాజుల బాబురావు, బత్తిని ప్రవీణ్, వీఓఏలు రమ, రమ్య, పావని, లలిత, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీపై అవగాహన

మొగుళ్లపల్లి : మండలంలోని రంగాపురంలో జేబీడీ సొసైటీ ఆధ్వర్యంలో వరి పంటలో డ్రోన్స్‌తో మందులను ఉచితంగా పిచికారీ చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు డ్రోన్ పిచికారీతో ఉపయోగాలను భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.గంగయ్య రైతులకు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు, రైతులు రాజేశ్వర్ రావు, కిషన్ రావు, తిరుపతిరావు, సంతోష్ రావు, నిరంజన్, భూమారావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నల్లాల పరిశీలన



నల్లాను పరిశీలిస్తున్న కమిషనర్

భూపాలపల్లి అర్బన్ : వేసవి నేపథ్యంలో తాగు నీటికి ఇబ్బందులు రాకుండా పట్టణ పరిధిలోని పలు వార్డులో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పర్యటించి కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పుల్లూరి రామయ్యపల్లి గ్రామంలో పర్యటించిన కమిషనర్ మాట్లాడుతూ.. వేసవికాలంలో నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు రాకుండా వాటర్ లీకేజీలు లేకుండా మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. నీటిని వృథా చేయకుండా చూసుకోవాలని, నల్లాలకు మోటార్లు పెట్టవద్దన్నారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ ఇంజనీర్ మానస, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ : సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంగా మారిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 38 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందజేస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నరన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కాంగ్రెస్ నాయకులు పున్నం రవి, మేకల భిక్షపతి, బొజ్జం రవి, షాబీర్ అలీ, రొంటాల వెంకటస్వామి, మైస భిక్షపతి, పల్నాటి శ్రీనివాస్, బానోత్ రాజేందర్, దుగ్యాల స్వామి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

డీఎంహెచ్ఓ మధుసూదన్



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మధుసూదన్

భూపాలపల్లి అర్బన్: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని పరీక్ష చేయించిన వారు, చేసిన వారు, ప్రోత్సహించిన వారు శిక్షార్హులు అవుతారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 14 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. ఐదు ప్రభుత్వ ఆధీనంలో, 9 ప్రైవేట్ సెంటర్లలో పనిచేస్తున్నాయన్నారు. పరీక్షలు చేయకూడదని లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.50 వేల జరిమానా విధిస్తారని వివరించారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే 94405 86982 నంబరు ద్వారా సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కవిత, డాక్టర్ సురేందర్, సోషల్ వర్కర్లు, డెమో శ్రీదేవి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి తొలగిన అడ్డంకి..

- అటవీ శాఖకు పరిహారం చెల్లింపు
- మాజీ ఎంపీపీ మల్హల్‌రావు



శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్హర్ : మండలంలోని పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి అటవీ ప్రాంతం గుండా భూపాలపల్లి వన్ ఇంక్లైన్ వరకు ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌లో రోడ్డు నిర్మాణానికి అటవీశాఖకు ప్రభుత్వం నిధులు చెల్లించినట్లు మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు తెలిపారు. నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి మల్హల్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కిషన్‌రావుపల్లి ఫారెస్ట్ రోడ్డు నిర్మాణానికి నష్టపోతున్న చెట్ల సంపదకు అటవీ శాఖకు చెల్లించాల్సిన సుమారు రూ.4.67 కోట్ల మొత్తాన్ని అటవీ శాఖ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని వెల్లడించారు. దీంతో భూపాలపల్లి రహదారికి అదిపెద్ద అడ్డంకిగా మారిన అటవీశాఖ అనుమతుల సమస్య తీరిందని ఆయన పేర్కొన్నారు. ఫారెస్ట్ రోడ్డు నిర్మాణంపై జీఓ విడుదల చేసి వారం గడవక ముందే నిధులు విడుదల చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం పరిపాలన దినోత్సవం



స్వయంపాలన వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిట్యాల : మండలంలోని నైన్‌పాక ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ప్రతిభను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులుగా ఎండీ సనా, ఎంఈఓగా రేపాల శ్రేయాన్షి, ఉపాధ్యాయులుగా స్వాతిక్, తనుశ్రీ, సాత్విక్, అనుశ్రీ, హర్షవర్ధన్, శ్రీతేజ, వైష్ణవి, నిహారిక, సోను, శార్వాణి తదితరులు ఉన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ కొడెపాక రఘుపతి, ప్రధానోపాధ్యాయులు తిరుపతయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. చదువుకుంటేనే భవిష్యత్‌లో ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ, కొత్తపల్లి ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు శ్యాంసుందర్, ఇక్రమొద్దీన్, సదానందం, అనిల్, గవస్కర్, హసీనా, రాజేష్, సీఆర్పీ తిరుపతి తదితరురులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



రేగొండ: పరీక్ష సామగ్రి అందజేస్తున్న కిరణ్



మల్హర్: పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న నాయకులు

రేగొండ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాక పాఠశాలలో సత్తన్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మొట్టె కిరణ్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు సూదనబోయిన ఓంప్రకాష్, పత్తి ప్రభాకర్, పంగ ఐలయ్య, బండారి రవీందర్, కిరణ్, గట్టు ప్రదీప్ ఉపాధ్యాయులు రాజేందర్, వెంకటేశ్వర్లు, పద్మ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మల్హర్ : మండలంలో వల్లెకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఇతర సామగ్రిని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. పదోతరగతి ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అంబేద్కర్ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు రాజబాబు, కోశాధికారి సంజీవ్, ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, ముత్తయ్య, కిరణ్, రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రేగొండ : ములుగు జిల్లా అబ్బాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు బుధవారం మండలంలోని కొడవటంచలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1999-2000 పదో తరగతి చదివిన విద్యార్థులు సిల్వర్ జూబ్లీ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు కుమార్, ప్రభాకర్, కిషన్, శంకర్, లింగమూర్తి, రాజేందర్, రాజమహేందర్, శ్రీను, సంపత్, లత, పద్మ, శ్రీమత తదితరులు పాల్గొన్నారు.